క్లుప్తంగా

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి



కేంద్ర ప్రభుత్వానికి పోస్టుకార్డులు పంపుతున్న విద్యార్థినులు

బత్తలపల్లి: ఆర్డీటీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఏఫ్‌సీఆర్‌ఏ లైసెన్సును రెన్యూవల్ చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ గత 50 ఏళ్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో బడుగు, బలహీన వర్గాలకు ఎంతో సేవ చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్సును కొనసాగించాలని, లేనిపక్షంలో ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం 1,600 పోస్ట్ కార్డులను కేంద్ర ప్రభుత్వానికి పంపారు. కార్యక్రమంలో టీచర్లు వీరనారప్ప, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నాణ్యతపై ఎమ్మెల్యే ఆగ్రహం



మధ్యాహ్న భోజన నాణ్యతపై హెచ్‌ఎంను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

పుట్టపర్తి: మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి హెచ్‌ఎం, భోజన ఏజెన్సీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శుక్రవారం బుక్కపట్నం మండలం పాముదుర్తి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. సన్నబియ్యానికి బదులు లావుగా ఉన్న బియ్యాన్ని వండటంతో పాటు పప్పు నీళ్లగా ఉందని ఎందుకు ఇలా చేశారని, మీ ఇళ్లలో మీ పిల్లలకు ఇలాంటి భోజనాన్ని,పప్పును వడ్డిస్తారా? అని హెచ్‌ఎం, మధ్యాహ్న ఏజెన్సీ సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠం బోధించారు.

ప్రకృతిలో ప్రతి రంగుకూ ప్రాముఖ్యత



రూపారాజ పీసీఎంఆర్ పాఠశాలలో రంగులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ధర్మవరం: ప్రకృతిలో ప్రతి రంగుకూ ఒక ప్రాముఖ్యత ఉంటుందని రూపారాజా పీసీఎం ఆర్ స్కూల్ చైర్మన్ హర్షవర్ధన్ పేర్కొన్నారు. రూపారాజ పీసీఎంఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంగులపై చిన్నారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రంగులు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రూపారాజకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడీఏకు సన్మానం



ఏడీఏ క్రిష్టయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

ధర్మవరం రూరల్: బదిలీపై హిందూపురం వెళ్లుతున్న ఏడీఏ క్రిష్టయ్యకు శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వ్యవసాయ రంగానికి క్రిష్టయ్య చేసిన సేవలను ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత ధర్మవరం ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓలు కృష్ణ కుమారి, రమాదేవి, ముస్తఫా, సిబ్బంది, ఎరువుల దుకాణ డీలర్లు పాల్గొన్నారు.

అన్నీతామై అంత్యక్రియలు



మృతదేహాన్ని తీసుకెళ్తున్న సొసైటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: ఖిద్మత్- ఎ-ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శుక్రవారం ఓ విదేశీయుడికి అన్నీతామై అంత్యక్రియలు నిర్వహించారు. జర్మనీ దేశానికి చెందిన ఇమ్‌రాయ్ స్టైనిచ్ (85) పట్టణంలో బైపాస్ రోడ్డులో నివాసం ఉంటున్నారు. అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. అతడికి తెలిసిన వారు ఎవరూ లేకపోవడంతో ఖిద్మత్ ఎఖల్క్ సొసైటీ సభ్యులు షామీర్, షాకీర్, గోపి, జానికాంపల్లి శ్రీనా పట్టణంలోని కర్ణాటకనాగేపల్లి శ్మశాన వాటికకు తీసుకెళ్లి వారి సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఎండిన చెరువులు నిండేనా?

- ప్రశ్నార్థకంగా మారిన ఆయకట్టు సాగు
- ముసురుకున్న మబ్బులు
- అన్నదాతల ఎదురుచూపు

ధర్మవరం రూరల్: వర్షాకాలంలో వర్షాలు కురవకపోవడంతో చెరువులన్నీ ఎండిపోతున్నాయి, చెరువుల్లోకి నీరు చేరకపోవడంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. నాలుగు రోజులుగా అల్పపీడన ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటనలు చేస్తుండడంతో వానలతో చెరువులు నిండుతాయని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఆయకట్టు భూముల్లో వరి నార్లు పోసుకొని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

వర్షా భావం కారణంగా బోరు బావుల్లో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలలో నీరు లేకపోవడంతో భూగర్భ జలాలు వృద్ధి చెందడం లేదని రైతులు అంటున్నారు. ఇప్పటికే బోరు బావుల కింద వేరుశనగ పంటలను సాగు చేసుకున్నారు. సకాలంలో వర్షాలు



పోతుకుంట చెరువులో కొద్దిగా ఉన్న నీరు

కురవకుంటే సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.

వర్షాల కోసం ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వర్షం ఇప్పుడో అప్పుడో వచ్చినట్లు వాతావరణం వుంది కాని చినుకు నేలపై రాలకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు లేకపోవడంతో మెట్ట భూముల్లో వేరుశనగ, కంది పంటలను సాగు చేసుకోలేకపోతున్నామని రైతులు అంటున్నారు. సాగు సమయం దాటి పోతుండడంతో బోరు బావులు వున్న తోటల్లో అయినా పంటలను సాగు చేసుకోవడానికి ఎదురు చూస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

ధర్మవరం చెరువు	
నీటి సామర్థ్యం	370.30 క్యూబిక్ మీటర్ కెపాసిటీ
నీటి నిలువ	373 టీఎంసీలు
ఆయకట్టు విస్తీర్ణం	1922 ఎకరాలు
భూగర్భ జలాలు పెరిగే గ్రామాలు	30
బోరు బావుల	600కు పైగా

గొట్లూరు చెరువు	
నీటి సామర్థ్యం	90.20 క్యూబిక్ మీటర్ కెపాసిటీ
నీటి నిలువ	0.90 టీఎంసీలు
ఆయకట్టు విస్తీర్ణం	542 ఎకరాలు
భూగర్భ జలాలు పెరిగే గ్రామాలు	8
బోరు బావులు	360కి పైగా

రావుల'చెరువు'	
నీటి సామర్థ్యం	48.44 క్యూబిక్ మీటర్ కెపాసిటీ
నీటి నిలువ	0.48 టీఎంసీలు
ఆయకట్టు విస్తీర్ణం	488 ఎకరాలు
భూగర్భ జలాలు పెరిగే గ్రామాలు	5
బోరు బావులు	200కు పైగా

రేగాటిపల్లి చెరువు	
నీటి సామర్థ్యం	40.45 క్యూబిక్ మీటర్ కెపాసిటీ
నీటి నిలువ	0.40 టీఎంసీలు
ఆయకట్టు విస్తీర్ణం	35 ఎకరాలు
భూగర్భ జలాలు పెరిగే గ్రామాలు	4
బోరు బావులు	200కు పైగా

పోతుకుంట చెరువు	
నీటి సామర్థ్యం	13.98 క్యూబిక్ మీటర్ కెపాసిటీ
నీటి నిలువ	0.13 టీఎంసీలు
ఆయకట్టు విస్తీర్ణం	218 ఎకరాలు
భూగర్భ జలాలు పెరిగే గ్రామాలు	3
బోరు బావులు	180కి పైగా

అప్రా'చెరువు'	
నీటి సామర్థ్యం	84.28 క్యూబిక్ మీటర్ కెపాసిటీ
నీటి నిలువ	0.84 టీఎంసీలు
ఆయకట్టు విస్తీర్ణం	375 ఎకరాలు
భూగర్భ జలాలు పెరిగే గ్రామాలు	5
బోరు బావులు	300కు పైగా

ఎన్నికల హామీలు అమలు చేయాలి



దండువారిపల్లిలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, నాయకులు



సామాలగొందిలో కార్యక్రమం నిర్వహిస్తున్న మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి, నాయకులు

గాండ్లపెంట: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీను అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. గాజులవారిపల్లి పెద్దతండా, సామాలగొంది, రెక్కమాను గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు సూపర్‌సిక్స్ అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్‌లో రైతుకు అన్నదాత సుఖీభవ పథకం అందలేదన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు గుప్పించి ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. ఇలా ఎన్నో రకాల వాగ్దానాలు ఇచ్చిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. పార్టీ మండల వైస్ కన్వీనర్ శంకర్‌నాయుడు, రైతు సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, బీసీ నాయకులు జక్కల నరసింహగౌడ్, గోపాల్‌నాయక్, పామిడి ఇక్బాల్, కటారుపల్లిక్రాస్ రవిచంద్రారెడ్డి, మేకల నరసింహులు, సిద్దేశ్వరనాయుడు, ఆసిఫ్, ఖాజావలీ, ఖలీల్, బాలకృష్ణానాయక్, ఆంజినేయులునాయక్, తిమ్మప్పనాయక్,జిలాన్, మహమ్మదాలీ, వెంకటేష్, అమృతనాయుడు, కదిరిప్ప, వీరమల్లప్ప, శ్రీరాములు, హరి, అనసూయమ్మ, కల్పన, ప్రసాద్, సునంద, శివకుమార్ తదతరులు పాల్గొన్నారు.

బాబు అంటేనే మోసం

తనకల్లు: ఎన్నికల హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలను మోసగించారని, బాబు అంటేనే మోసం అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని దండువారిపల్లిలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా రాష్ట్రంలో అరాచక పాలన చేస్తోందన్నారు. ఇంటింటా తిరుగుతూ చంద్రబాబు వంచనను వివరించారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ హిమధర్‌రెడ్డి, నాయకులు భక్తవత్సలరెడ్డి, దేశాయి సంజీవురెడ్డి, బాల్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, స్థానిక నాయకులు సోమశేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి,రమేష్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వెంకటరెడ్డి, నాగభూషణం, రమేష్‌నాయక్, హరినాయక్, మధుసూదన్‌రెడ్డి, శంకర్‌నాయక్, గోపాల్‌నాయక్, బోత్సనాయక్, వెంకటరమణానాయక్, మహేష్‌నాయక్, శేఖర్‌రెడ్డి, మహదేవారెడ్డి, పారేసు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రతి గడపకూ తీసుకెళ్దాం

నల్లచెరువు: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను గ్రామాల్లోని ప్రతి గడపకూ తీసుకెళ్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి తెలిపారు. బాలేపల్లి తండా గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చాక హామీలను గాలికొదిలేశారన్నారు. అనంతరం షూరిటీ–మోసం గ్యారెంటీ క్యూర్ కోడ్ ప్రజల చేత ఆవిష్కరింప జేశారు. వైఎస్సార్‌సీపీ వైస్ కన్వీనర్లు వై. సోమిరెడ్డి, రఫి, సర్పంచ్ సోనాలమ్మ, నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ హైటెక్ రమణ, సీనియర్ నాయకులు నమసింహారెడ్డి, కోనపల్లి రమణారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, మాజీ టెంపుల్ చైర్మన్ ఆనంద్ రెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకులు ఖాదర్‌వలి, ప్రధాన కార్యదర్శులు సలీం లక్ష్మిపతి,క్రిష్టా నాయక్, మండల కార్యదర్శులు కృష్ణ మూర్తి, గ్రామ కన్వీనర్లు వీరారెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి(జేసీబీ) మాజీ డైరెక్టర్లు ఆదిమూర్తి, గోవిందురెడ్డి, నాయకులు బాలకృష్ణనాయక్, గోపాల్‌నాయక్, నన్నేనాయక్, రామునాయక్, గోపాల్‌నాయక్, సూర్యనారాయణనాయక్, వనస్పత్‌నాయక్, మునిస్వామి, రమేష్‌నాయక్, మహేంద్రనాయక్, శశికుమార్‌నాయక్, ప్రవీణ్‌నాయక్, జగన్‌నాయక్, వినోద్‌నాయక్, బాలాజీనాయక్, రాజు నాయక్ తాజుద్దీన్ సూర్యనారాయణ నాయక్ పాల్గొన్నారు.



బాలేపల్లి తండాలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, గ్రామస్తులు

అధికారుల తీరుపై ఎంపీపీ ఆగ్రహం

నల్లచెరువు: ఎంపీడీఓ రఘునాథ గుప్తతో పాటూ మండలంలోని పలు శాఖల అధికారులపై ఎంపీపీ రమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం 10 గంటలకు ప్రారంభమైనా పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు 11:30 దాటినా సమావేశానికి హాజరు కాలేదు. ప్రజా సమస్యలపై ప్రతి మూడు నెలలకు ఒక్కసారి నిర్వహించే సమావేశానికే అధికారులు రాకపోవడం ఏంటని ఎంపీపీ మండిపడ్డారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. వాతావరణ మార్పులతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని, గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులను చేయాలన్నారు. పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు లేక పిల్లలు ఇబ్బందులపు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని, పూలకుంట చెరువు, పంతులచెరువు చెరువులకు హంద్రీనీవా నీటిని విడుదల చేయాలని పలువురు ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మండల పరిషత్ కార్యలయ సిబ్బంది సమయ పాలన పాటించడంలేదని తమ దృష్టికి వచ్చిందని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ ఆదేశించారు. తహసీల్దార్ జమానుల్లా ఖాన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రమణారెడ్డి

ఉన్నత పాఠశాల తనిఖీ

కొత్తచెరువు: బండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆర్డీఓ సువర్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులతో మధ్యాహ్న భోజనం, విద్యార్థి మిత్ర కిట్లు తదితర విషయాలపై ఆరా తీశారు. పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలు పరిశీలించారు. పుస్తకాలను వినియోగించుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలని ఆర్డీఓ ఉపాధ్యాయులకు సూచించారు.

కేసు నమోదు

ధర్మవరం రూరల్: వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ధర్మవరం మండలం తుంపర్తి గ్రామానికి చెందిన ఎస్. సూర్యనారాయణపై భరత్‌రెడ్డి తోపాటు మరో వ్యక్తి కాళ్లతో తన్నడంతోపాటు దాడి చేసి కొట్టారని బాధితుడు టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

ట్రైనీ డీఎస్పీకి సన్మానం



డీఎస్పీ ఉదయపావనిని సన్మానిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీ డీఎస్పీ ఉదయ పావనిని జిల్లా ఎస్పీ రత్న శుక్రవారం సన్మానించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ సవాళ్లతో కూడుకున్నదని, శిక్షణా కాలంలో బాగా కష్టపడి పనిచేస్తారో వారు భవిష్యత్‌లో గుర్తింపు పొందుతారన్నారు. డీఎస్పీ పావని కష్టతరమైన కేసుల్లో కూడా బాగా చాకచక్యంగా పనిచేశారని కొనియాడారు. అనంతరం డీఎస్పీ శిక్షణలో తనకు సహకరించిన పోలీసులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఎస్‌బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్‌ఐలు వలి, మహేష్, డీసీఆర్‌బీ, సోషల్ మీడియా సీఐలు శ్రీనివాసులు, మోహన్, ఆర్‌ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, వీరన్న, ఐటీ కోర్ ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహాలను శుభ్రంగా ఉంచుకోరా?

చెన్నేకొత్తపల్లి: వసతి గృహాలు అపరిశుభ్రతగా ఉండటంతో తహసీల్దార్ సురేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బీసీ బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల్లోని గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో కుళాయిల వద్ద అపరిశుభ్రత ఉండటంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. చేతులు, ప్లేట్లు కడగడానికి అక్కడ సోపు లేకపోవడంతో ఎలా శుభ్రం చేసుకుంటారని వసతి గృహం అధికారిని ప్రశ్నించారు. వంట గదిలో కురగాయలు లేకపోవడంతో ఏ విధంగా వంట చేస్తారని ఆరా తీశారు. కూరగాయలను అప్పటికప్పుడు తెచ్చుకుంటామని అధికారులు సమాధానం ఇచ్చారు. మోనూ ప్రకారం చేసిన టిఫిన్‌ను రుచి చూశారు. అలాగే మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. తాగు నీటి క్యాన్ శుభ్రంగా ఉంచాలన్నారు. డ్రైనేజీని శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సిబ్బందిని ఆదేశించారు.కార్యక్రమంలో ఆర్ఐ నరసింహా మూర్తి, వీఆర్ఏలు, వసతి గృహం సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్సీ బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్ కుమార్

సంక్షిప్త సమాచారం

బూరుగుపల్లిలో పీఫోర్ సర్వే

కదిరి అర్బన్: మండలంలోని బూరుగుపల్లిలో శుక్రవారం తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప పీఫోర్ సర్వే నిర్వహించారు. పీ ఫోర్ నిబంధనల ప్రకారం బంగారు కుటుంబాలను గుర్తించారు. పేదల జీవనప్రమాణాలు పెంపొందించేందుకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ తల్లం నారాయణమూర్తి, అధ్యక్షుడు జగ్గా వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ ప్రియాంక చేతుల మీదుగా 50 మంది గర్భిణులకు పండ్లు అందించారు. సంస్థ సభ్యులు రామకృష్ణ, చిన్నప్ప, మహిళా డైరెక్టర్ రమణమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా ఉన్న ఐదు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎన్ ఎస్ గేట్ విద్యుత్‌శాఖ ఏఈ రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. మెయిన్ సప్లయ్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బీసీ హాస్టల్ తనిఖీ

ముదిగుబ్బ: ఎనుములవారిపల్లిలోని బీసీ హాస్టల్‌ను శుక్రవారం డీఎల్‌పీఓ శివకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, ఆహార నాణ్యతను డీఎల్‌పీఓ పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంపీడీఓ దివాకర్, పంచాయతీ కార్యదర్శి బాబ్‌జాన్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ నరేంద్ర ఉన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కదిరి అర్బన్: యోగాతో మానసిక ఒత్తిడి తొలగి ప్రశాంతత లభిస్తుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులు దేవికీబాలాజీ, డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వారు మానసిక ఒత్తిడిని ఎలా తగ్గించుకోవాలి అన్న అంశంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులతో ఆసనాలు చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

ధర్మవరం రూరల్: పట్టణంలోని గిర్రాజు కాలనీకి చెందిన భవాని అనే మహిళ తన భర్త హరీష్ విడాకులు ఇవ్వాలని వేధింపులకు గురి చేస్తున్నట్లు శుక్రవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు..భవానికి పుట్టపర్తి మండలం కర్ణాటకనాగేపల్లికి చెందిన హరీష్‌తో వివాహం జరిగింది. అయితే ఇప్పటి వరకు సంతానం కలగలేదు. దీంతో తనకు విడాకులు ఇవ్వాలని భర్త బలవంతం చేయడంతోపాటు తన అత్త లక్ష్మీతో కలిసి చిన్న చిన్న విషయాలకే తిడుతూ మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారు. వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

తాడిమర్రి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ హరిత, డాక్టర్ గోవర్ధన్ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ముఖ్యంగా మహిళల్లో 30 నుంచి 60 ఏళ్లలోపు సర్వైకల్ క్యాన్సర్ సోకే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తలో భాగంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ శిరీష, డాక్టర్ జ్యోతి సుచిత్ర, ఆర్‌డీటీ మెడికల్ ఆఫీసర్ హిమశ్రీ నళిని, సీహెచ్‌ఓ లలితకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కూష్మాండ దీపోత్సవం



కాలభైరవస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీ చక్రవర్తి థియేటర్ ఎదురుగానున్న స్వయంభు కాలభైరవస్వామి ఆలయంలో పూజారి ధనుంజయ ఆచారి గురువారం, శుక్రవారం అమావాస్య గడియల్లో కూష్మాండ దీపోత్సవాన్ని నిర్వహించారు. అమావాస్య గడియల్లో దోష నివారణ పూజలు చేశారు. అనంతరం కాలభైరవస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భైరవస్వామి ఎదుట గుమ్మడికాయపై దీపాలు వెలిగించి పూజలు చేపట్టారు. భక్తులకు కంకణధారణ చేశారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆలయాల్లో 'శ్రావణ' పూజలు



బత్తలపల్లిలో పూజలందుకున్న మహాలక్ష్మి

బత్తలపల్లి: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని పోట్లమర్రిలోని యల్లమ్మ, పెద్దమ్మ, గంటాపురంలోని మారెమ్మ, బత్తలపల్లిలోని బళ్లారి దుర్గమ్మ, పెద్దమ్మ, అంకాలమ్మ, గంగమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకున్నారు. పోట్లమర్రి ఆంజనేయస్వామికి ఆకుపూజలు నిర్వహించారు.

ముదిగుబ్బ: శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా మండలకేంద్రంలో మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పెద్దమ్మతల్లి, సంజీవరాయ స్వామి గ్రామోత్సవం

బత్తలపల్లి: గంటాపురం ఎస్సీ కాలనీలో శుక్రవారం పెద్దమ్మతల్లి, సంజీవరాయస్వామి విగ్రహాల గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా వేదపండితులు చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో వారి శిష్య బృందం వివిధ పూజలు చేపట్టారు. గ్రామోత్సవం అనంతరం విగ్రహాలను ధాన్యంలో ఉంచారు. శనివారం స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తొప్పెట అలివేలమ్మ, పెద్దన్న, నరసింహులు, మంజునాథ్ తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచు అక్కిం దామోదర్, ఎంపీటీసీ సభ్యులు తొప్పెట ఆంజనేయులు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయండి



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న డీఎస్పీ శివనారాయణ స్వామి

నల్లచెరువు: పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని డీఎస్పీ శివనారాయణ స్వామి ఆలయ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన సీఐ నాగేంద్ర, నల్లచెరువు ఎస్ఐ మక్బూల్ బాషతో కలిసి ఆలయానికి చేరుకుని ఏర్పట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామి వారి చిత్ర పటాలను బహుకరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు మండల మీట్

తనకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.